




AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

16-12-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## టీచర్లు ఎక్కడా..?



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని నకాష్ గల్లి ప్రాథమికోన్నత పాఠశాల పరిస్థితి దారుణంగా తయారైంది. పాఠశాలలో ఉన్న ఐదుగురు ఉపాధ్యాయుల్లో ఇద్దరు ఎన్నికల విధులకు వెళ్లగా మరో ముగ్గురు సెలవులో ఉన్నట్లు సమాచారం. దీంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండానే తరగతులు కొనసాగుతున్నాయి. పాఠశాలలో ఫేషియల్ అటెండెన్స్ కూడా ఏడో తరగతి విద్యార్థిని తీసుకోవడం గమనార్హం. విద్యార్థినికే గత రెండు రోజులుగా అటెండెన్స్ ట్యాబ్ అప్పజెప్పినట్లు సమాచారం. అయితే షఫీ అనే సీఆర్పీకి పాఠశాలను అప్పజెప్పినట్లు తెలిసింది.. కానీ ఆయన కూడా ఆలస్యంగా వచ్చి తొందరగా వెళ్తున్నట్లు సమాచారం.

## మూడో విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్



**అక్షరటుడే, బాన్సువాడ:** మూడో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. బాన్సువాడలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఎన్నికల సామగ్రిని ఎలాంటి లోటుపాట్లు గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పక్కాగా అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందిందా లేదా పరిశీలించుకోవాలని సిబ్బందితో పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సంబంధిత అధికారుల దృష్టికి తేవాలని, పోలింగ్ స్టేషన్‌లో అన్ని ఏర్పాట్లపై క్రాస్‌చెక్ చేసుకోవాలని ఆర్వోలకు సూచించారు. ఆయన వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తదితరులున్నారు.

## జిల్లాను ముందు వరుసలో నిలబెట్టాలి



**అక్షరటుడే, ఇందూరు:** అభివృద్ధిలో నిజామాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలబెట్టాలని, ఇందుకు ప్రతి అధికారి నిబద్ధతతో పనిచేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సూచించారు. నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం సుభాష్ నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలని సూచించారు. రహదారుల అభివృద్ధి, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ ఈఈ సుదర్శన్ రెడ్డి, రోడ్ల భవనాల శాఖ డీఈ ప్రవీణ్, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# తుది పోరుకు సర్వం సిద్ధం



■ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు ■ పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది ■ నిజామాబాద్‌లో 165, కామారెడ్డిలో 168 గ్రామాల్లో ఎన్నికలు

**తుది విడత పంచాయతీ ఎన్నికలకు వేళయింది. మూడో విడత పోలింగ్ బుధవారం నిర్వహించనున్నారు. ఎన్నికల కోసం ఉమ్మడి జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. పోలింగ్ సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. అధికారులు, సిబ్బంది బూత్‌లకు చేరుకున్నారు.**

**- అక్షరటుడే, ఇందూరు**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్‌లోని 12 మండలాల్లో ఎన్నికలకు నిర్వహించనున్నారు. ఆలూరు ఆర్మూర్, బాల్కొండ, భీమ్‌గల్, డొంకేశ్వర్, కమ్మర్‌పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల్లో బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 165 గ్రామపంచాయతీలకు గాను.. ఇప్పటికే 19 గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా 146 సర్పంచ్ స్థానాలకు 562 మంది పోటీలో ఉన్నారు. అలాగే 1,620 వార్డు స్థానాలకు.. 490 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో 1,130 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 3,382 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎన్నికల కోసం 1,490 పోలింగ్ స్టేషనులను ఏర్పాటు చేశారు.

### పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది..

పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని సిబ్బందికి అందజేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సిబ్బంది తరలింపునకు నిజామాబాద్‌లో 38 రూట్లలో వాహనాలను సైతం ఏర్పాటు చేశారు.

### ప్రలోభాలపై నిఘా..

ఎన్నికలకు కొన్ని గంటలు మాత్రమే సమయంలో గ్రామాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఉండేలా తనిఖీలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 34 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బలగాలను మోహరించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ చేపడతారు.

### ఆర్మూర్ డివిజన్ ప్రతిష్ఠాత్మకం

జిల్లాలో చివరి విడత ఎన్నికలు ఆర్మూర్ డివిజన్‌లో జరగనున్నాయి. అయితే ఇక్కడి నుంచి కీలక నేతలు ప్రాతినిధ్యం వహించడంతో త్రిముఖ పోరు జరగనుంది. బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ, ఆమె తనయుడు మల్లికార్జున్, కాంగ్రెస్ నుంచి సునీల్ రెడ్డి ఉన్నారు. తమ మద్దతుదారులు గెలుస్తారని ఎవరికివారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్‌లో కాంగ్రెస్ నుంచి వినయ్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీజేపీ నుంచి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి ఉన్నారు. దీంతో త్రిముఖ పోరు తప్పదని ప్రజలు భావిస్తున్నారు.

### కామారెడ్డి జిల్లాలో ..

బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, బిచ్కుంద, డొంగ్లీ, మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్ మండలాల్లోని 168 గ్రామ పంచాయతీలు, 1,482 వార్డు స్థానాల్లో ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో 26 సర్పంచ్ స్థానాలు, 449 వార్డులు ఏక్రగీవం అయ్యాయి. ఇక 13 వార్డులకు నామినేషన్లు రాలేదు. దీంతో 142 సర్పంచ్, 1020 వార్డుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. 1,482 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మొత్తం 812 మంది పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుతో పాటు అదనంగా 37 రూట్ మొబైల్ పార్టీలు, 8 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను మోహరించారు.




## లక్షలు వెచ్చించి.. వృథాగా వదిలేసి..

**అక్షరటుడే, బోధన్:** బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లను ఊడ్చేందుకు రూ.లక్షలు వెచ్చించి తీసుకొచ్చిన స్వీపింగ్ మిషన్ వృథాగా మారింది. రెండేళ్ల క్రితం రూ.75లక్షలకు పైగా వెచ్చించి ఈ స్వీపింగ్ మిషన్‌ను అప్పటి పాలకవర్గం కొనుగోలు చేసింది. మిషన్‌ను తీసుకొచ్చిన 15 రోజుల్లోనే పాడైంది. ఈ యంత్రం మరమ్మతులకు సైతం రూ.లక్షల్లో ఖర్చు అవుతుండడంతో దానిని పక్కన పెట్టేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణను సంప్రదించగా.. గత పాలకవర్గం ఉన్నప్పుడు ఈ మిషన్ తీసుకొచ్చారన్నారు. ఈ యంత్రం బోధన్ రోడ్లకు ఏమాత్రం పనిచేయదని వివరించారు. మరమ్మతులకు సైతం రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుందని ఆయన పేర్కొన్నారు. స్వీపింగ్ మిషన్ మరమ్మతుల విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

## పంచాయతీ ఎన్నికల కోసం పటిష్ట బందోబస్తు: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** మూడో విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మూడో విడత ఆర్మూర్ డివిజన్ పరిధిలో పంచాయతీ ఎన్నికలు ఉన్నాయని సీపీ పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 12 మండలాల్లోని 148 పంచాయతీలు, 1,496 పోలింగ్ స్టేషన్లలో 3,26,029 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. 1100 మందిని సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇందుకుగాను సబ్ డివిజన్ పరిధిలోని ఎన్నికలు నిర్వహించే ప్రాంతాల్లో మూడు చెక్‌పోస్ట్‌లను (పోతంగల్, సాలూర, ఖండ్‌గావ్) ఏర్పాటు చేశామన్నారు. 60 సమస్మాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా పెట్టామని, 24 ఎఫ్ఎస్‌టీ టీంలు, 5 ఎస్ఎస్‌టీ టీంలు పనిచేస్తున్నాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన ఘటనల్లో ఇద్దరిపై కేసులు నమోదు చేశామని సీపీ తెలిపారు. కమ్మర్‌పల్లి, నందిపేట్ పోలీస్ స్టేషన్‌లలో ఆయా కేసులు నమోదయ్యాయన్నారు.

## సోమార్‌పేట్ ఘటన బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సోమార్‌పేట్ ఘటన బాధితులను ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పరామర్శించారు. గాయపడిన వారిలో బిట్ల భారతి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. బాలమణి వెల్‌నెస్ ఆస్పత్రిలో చేరారు. వారిని మంగళవారం కలిసి ఆర్థికసాయం అందజేశారు. ఆయా కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆస్పత్రి వర్గాలతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులకు కష్టకాలంలో అన్ని విధాలా సహాయసహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు జరగడం విచారకరమన్నారు. ఎస్పీ, డీఎస్పీతో మాట్లాడి విచారణ పారదర్శకంగా నిర్వహించాలని కోరామన్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటికే ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.



## డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్

**అక్షరటుడే, ఆర్మూర్:** గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అలూర్, ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీవో, ఓపీవోలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అలాగే నందిపేట, డొంకేశ్వర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సైతం సందర్శించి పోలింగ్ సామగ్రి పంపిణీ తీరును పరిశీలించారు. వీరి వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## పెద్దమల్లారెడ్డిలో ఆవుపై పెద్దపులి దాడి..



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. రైతులు, ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. దోమకొండ మండలంలోని అంబారిపేట శివారులో దూడలపై పెద్దపులి దాడి చేసినట్లు అక్కడి రైతులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి డబుల్ బెడ్ రూం సముదాయం నుంచి మాందాపూర్ వెళ్లేదారిలో ఆకుతోట రామచంద్రం వ్యవసాయ క్షేత్రంలో మరోమారు పులి సంచారం ఆందోళనకు గురిచేసింది. సోమవారం రాత్రి ఓ ఆవుపై దాడి చేసి చంపేసినట్లు రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పెద్దపులి సంచరించిన ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు అటవీ ప్రాంతంలో ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ట్రాక్ కెమెరాలో పెద్దపులి కదలికలు స్పష్టంగా రికార్డు అయినట్లు తెలుస్తోంది. దీంతో ఈ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. పెద్దపులి సంచారంతో పశువుల కాపరులు, వ్యవసాయ పనులు చేసుకునే వారు పొలాల వైపు వెళ్లడానికి భయపడిపోతున్నారు. రాత్రివేళల్లో ఒంటరిగా బయటకు రావొద్దని ఫారెస్ట్ అధికారులు హెచ్చరించారు. గత జులై నెలలో రెడ్డిపేట తండా శివారులో పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అటవీశాఖ అధికారులు ఆపరేషన్ టైగర్ పేరిట పెద్దపులి కోసం జల్లెడ పట్టినా దాని జాడ కనిపించలేదు. కాగా.. పెద్దపులి క్షేమంగా వేరే ప్రాంతానికి చేరి ఉంటుందని తేలడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మళ్లీ ఐదు నెలల తర్వాత పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది.




## పన్నులు కడితేనే వేగంగా అభివృద్ధి సాధ్యం

**అక్షరటుడే, బోధన్:** ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తేనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్ మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన 15 చెత్త సేకరించే ఆటోలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రతిఇంటికి చెత్త సేకరించే ప్రణాళికతో అధికారులు ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రజలు సైతం పన్నులు సకాలంలో చెల్లిస్తే అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని పేర్కొన్నారు. వందశాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ సిబ్బందిని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్, బోధన్ మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ ఎల్లయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాషా తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయిస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆయనను టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యల గురించి ప్రస్తావించారు. జర్నలిస్టుల దీర్ఘకాల సమస్య అయిన ఇళ్ల స్థలాల అంశాన్ని సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి భూ సేకరణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐజేయూ నాయకులు ఎడ్ల సంజీవ్, బొబ్బిలి నర్సయ్య, చింతల గంగాదాస్, రామకృష్ణ, శేఖర్, రాజేష్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

**అక్షరటుడే, గాంధారి :** జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల కబడ్డీ పోటీలకు పేట్‌సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బానోత్ ఉష ఎంపికైనట్లు హెచ్‌ఎం కుమార స్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గుడివెనక తండా గ్రామ పంచాయతీకి చెందిన బానోత్ విఠల్, మంగతిబాయి రెండో కూతురు ఉష జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో ఆమె జాతీయస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు.

## మల్లన్నకు ఒడిబియ్యం సమర్పణ



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి శ్రీ మల్లికార్జున స్వామి స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం మల్లికార్జున స్వామి, మేడాలమ్మ గొల్లకేతమ్మలకు భక్తులు ఒడిబియ్యం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారికి కానుకలు సమర్పించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి దర్శనానికి వందలాది సంఖ్యలో భక్తులు క్యూ కట్టారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ఎడ్లబండ్లు ఊరేగింపు నిర్వహించనున్నారు.

## మూడో విడత ఎన్నికలకు పటిష్టమైన భద్రత: ఎస్పీ రాజేష్ చంద్ర



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో మూడో విడత ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలకు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఐదు అంచెల భద్రతా వ్యవస్థలో మొత్తం 812 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, మూడు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు, 25 ఎఫ్ఎస్‌టీ బృందాలు, ఐదు ఎస్ఎస్‌టీ బృందాల ద్వారా నిరంతర వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుతో పాటు అదనంగా 37 రూట్ మొబైల్ పార్టీలు, ఎనిమిది స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, మూడు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు మోహరించామని పేర్కొన్నారు. మూడో విడత ఎన్నికల్లో 10 క్రిటికల్, 9 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలింగ్ కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నించినా.. సోషల్ మీడియాలో తప్పుడు, విద్వేషపూరిత ప్రచారాలు చేసినా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారని అక్రమ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 18 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.



**జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే నియోజకవర్గంలో ఇద్దరు నేతలు ఎన్నికలను సవాల్‌గా తీసుకున్నారు. తమ బలం చూపించడం కోసం ఇరువురు నేతలు పోటాపోటీగా అభ్యర్థులను నిలిపారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి తమ అనుచరులను బరిలోకి దింపారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు నేతల మధ్య పోరు నువ్వా నేనా అన్నట్లు సాగనుంది. - అక్షరటుడే, కామారెడ్డి**



# పోచారం వర్సెస్ ఏనుగు

- పట్టు నిలుపుకునేందుకు ఇద్దరు నేతల పోటాపోటీ
- సర్పంచ్ ఎన్నికల బరిలో వారి అనుచరులు
- నువ్వా నేనా అన్నట్టు సాగనున్న మూడో విడత పోలింగ్

బాన్సువాడ నియోజకవర్గం కామారెడ్డి, నిజామాద్ జిల్లాల్లో విస్తరించి ఉంది. అక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఏనుగు రవీందర్‌రెడ్డి నియోజకవర్గంలో పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. అప్పటి నుంచి అక్కడ రాజకీయాలు వేడెక్కాయి. ఈ తరుణంలో సర్పంచ్ ఎన్నికలు ఆ ఇద్దరి నేతల మధ్య మరోసారి వార్ సృష్టించనున్నట్టుగా ప్రచారం సాగుతోంది.

### పట్టు కోసం పోటాపోటీ

బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం తొమ్మిది మండలాలు ఉన్నాయి. ఇందులో మొదటి విడతలో కోటగిరి, పోతంగల్, రుద్రూర్, వర్ని, చందూర్, మోస్రా మండలాలలో ఎన్నికలు జరిగాయి. 80 గ్రామాల్లో 13 ఏకగ్రీవం కాగా.. మిగతా గ్రామాల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో దాదాపు మెజారిటీ సర్పంచ్ స్థానాలు పోచారం వర్గం గెలుచుకున్నట్టుగా ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం మూడో విడతలో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మండలాల్లో 55 గ్రామాలు ఉండగా.. 12 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఇక 43 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ 43 గ్రామాల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి వర్గీయులు పోటీలో ఉన్నట్టుగా సమాచారం.

### మద్దతుదారుల గెలుపు కోసం..

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. అయితే బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా రవీందర్‌రెడ్డి కొనసాగుతున్నారు. దీంతో ఇద్దరు నేతల మధ్య పడడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఇద్దరు నేతలు పోటాపోటీగా అనుచరులను సర్పంచ్ ఎన్నికల బరిలో ఉంచారు. దీంతో నువ్వా నేనా అన్నట్లు పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ సైతం తమ మద్దతుదారులను గెలిపించుకునే పనిలో పడ్డాయి.

## గుండెపోటుతో మున్సిపల్ జవాన్ మృతి



**అక్షరటుడే, భీమ్‌గల్:** విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన మున్సిపల్ జవాన్ గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. ఈ ఘటన భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. తోటి ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న నిత్యం మాదిరిగానే ఉదయం విధులకు హాజరయ్యారు. అయితే కొద్దిసేపటికే ఛాతీలో నొప్పిగా ఉందని సహచరులకు చెప్పి ఇంటికి వెళ్లాడు. ఇంటికి చేరుకున్న కాసేపటికే పరిస్థితి విషమించి ఆయన కన్నుమూశారు. రాజన్న మృతి విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయన నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ రూ.10 వేలు, మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ తరపున మరో రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సంఘం యూనియన్ అధ్యక్షుడు సున్నపు ఓంకార్ మాట్లాడుతూ.. 2001 నుంచి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలో జవాన్‌గా సేవలందించిన రాజన్న మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని, అర్హతను బట్టి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

## బీమా రంగంలో ఎఫ్‌డీఐకి అనుమతి సరికాదు



**అక్షరటుడే, ఇందూరు :** బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డీఐని భారత ప్రభుత్వం అనుమతించడాన్ని ఖండిస్తున్నామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజుగౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ అనాలోచితమైన నిర్ణయం జాతీయ ప్రయోజనాలకు హానికరమన్నారు. దేశ ఆర్థిక భద్రతకు, ఆర్థిక సార్వభౌమత్వానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. బీమా వంటి కీలక, సున్నితమైన రంగాన్ని పూర్తిగా విదేశీ పెట్టుబడికి అప్పగించడం ద్వారా, భారత ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను కాపాడాలనే తమ బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని ఆయన విమర్శించారు. బీమారంగం దేశీయ పొదుపును సమీకరించడంలో, కోట్లాది మంది పౌరులకు సామాజిక, ఆర్థిక భద్రతను అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. అలాంటి రంగాన్ని విదేశీయుల పరంచేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.



## ఎన్నికల వేళ అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** సర్పంచ్ ఎన్నికల సందర్భంగా మండలంలో అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై అరుణ్ కుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దన్నారు. పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక



**అక్షరటుడే, ఆర్మూర్:** మాక్లూర్ మండలం మెట్టు గ్రామ నూతన సర్పంచ్, పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి సమక్షంలో మంగళవారం వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం బడుగు,బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ చేస్తున్న అభివృద్ధిని చూసి పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఇటీవల మెట్టు సర్పంచ్‌గా ఎన్నికైన స్వతంత్ర అభ్యర్థి గాజుల నవీన్ కాళీ, ఉప సర్పంచ్ బత్తుల వినయ్ సాగర్, వార్డు మెంబర్లు విజయశాంతి, సత్య కళ్యాణి, యాకూబ్, వెంకటేశ్వర్లు, అబ్రహంలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు గోపాల్, నగేష్, విఠల్‌రావ్ పాల్గొన్నారు. అలాగే మాక్లూర్ మండలం మందాపూర్ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన స్వతంత్ర అభ్యర్థి మహేశ్, వార్డ్ మెంబర్లు సరికెల గంగాధర్, కంఠమనేని ప్రదీప్, శ్రీను వినయ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాక్లూర్ పీఏసీఎస్ ఛైర్మన్ అశోక్, ఉప సర్పంచ్ సుమన్, ఈదరి బాబు, రాంబాబు, రమణ, కృష్ణరావు, అల్లరి పోశెట్టి, సాయిలు, బెగారి శ్రీను, సురేష్ పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డిలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప ఆరట్టు ఉత్సవం


**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలో మంగళవారం అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని స్వాములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. ఆరట్టు కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. శివాజీ చౌక్, వైశ్య భవన్, డైలీ మార్కెట్ , గాంధీచౌక్, బస్టాండ్ మీదుగా అయ్యప్ప స్వాములు పాటలు పాడుతూ.. పేటతుల్లి ఆడుతూ శోభాయాత్రలో పాల్గొన్నారు. యాత్రలో అయ్యప్పస్వాములకు మహిళలు మంగళహారతులు ఇస్తూ పాదపూజలు నిర్వహించారు. భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. పెద్ద చెరువులో ఆలయ పూజారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి తీర్థస్నానం చేయించారు. కార్యక్రమంలో గురుస్వాములు చంద్రం, కృష్ణారెడ్డి, రాజేంద్రనాథ్, దేవగౌడ్, ఈశ్వర్ గౌడ్, మురళి, డాక్టర్ సాయిలు, అమృత్, శశికాంత్ రెడ్డి, తరుణ్, హరిబాబు, హరిప్రసాద్ అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



## నూతన కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రావణిని మంగళవారం కాంగ్రెస్ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు ధోండి రమణ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఆర్మూర్‌లోని 13, 29, 30 వార్డుల్లో సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పట్టణాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట 13వ వార్డు కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కన్నం లక్ష్మణ్, 30వ వార్డు కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పింజా అభినవ్, సీనియర్ నాయకులు కన్నం ప్రసాద్, పసుపుల నరేష్, గుంజల సుమన్, పింజ రాజశేఖర్, సన్నీ తదితరులు ఉన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో చేతిరాత శిక్షణ శిబిరం




**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ శివారులోని గాంధీనగర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో చేతిరాత శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ శిబిరం పదిరోజుల పాటు కొనసాగుతుందని పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ తెలిపారు. శిక్షణ శిబిరానికి బోధకులుగా ప్రముఖ చేతిరాత నిపుణులు డోంగరి రమేష్ హాజరై మాట్లాడారు. అందమైన చేతిరాత విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి విజయానికి తొలి మెట్టు అవుతుందని అన్నారు. సరైన విధానంలో అభ్యాసం చేస్తే ప్రతి విద్యార్థి అందంగా రాయగలడన్నారు. మంచి చేతిరాత వల్ల ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ఆలోచన, స్పష్టత పెరుగుతాయని ఆయన వివరించారు. అలాగే చేతిరాత సాధన ద్వారా మెదడు సమన్వయం, జ్ఞాపకశక్తి, సహనం పెరుగుతాయన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు దోహదపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పాలనాధికారిని పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.